

ప్రజాశక్తి
గురువారం 30 అక్టోబర్ 2025
5
పార్వతీపురం మన్యం





పాచిపెంట.. ఘాట్‌రోడ్‌లో రాయిని జెసిబి సాయంతో తొలగిస్తున్న పోలీసులు

విరిగిపడిన కొండచరియలు

ప్రజాశక్తి-పాచిపెంట

తుపాను కారణంగా కురిసిన వర్షాలకు మండలంలోని ఆజూరు, కంకణాపల్లి, ఆంధ్రా- ఒడిశా ఘాట్‌రోడ్‌లో మంగళవారం రాత్రి కొండచరియలు విరిగి రహదారికి అడ్డంగా పడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ విషయం తెలుసుకున్న తహశీల్దార్ డి.రవి, పిఆర్ డిఇఇ శర్మ, పోలీసులు బుధవారం ఉదయం జెసిబి సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న కొండచరియలను తొలగించారు. రాకపోకలకు అంతరాయం లేకుండా చేయడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

రాకపోకలు అంతరాయం

కురుపాం : మండలంలో జి.సివడ పంచాయతీలో గిరిశిఖర గ్రామమైన కోటకొండకు వెళ్లే మార్గంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి ఎం.ధనుంజయరావు, విఆర్‌ఒ సుశీల, సచివాలయ సిబ్బంది.. గ్రామస్తుల సహకారంతో రోడ్డుపైనున్న కొండ చరియలను తొలగించారు. దీంతో రాకపోకలు యథాతథంగా సాగాయి.



భామిని.. పత్తి పంటలో చేరిన నీరు



నేలకొరిగిన వరిచేనును పైకి ఎత్తుతున్న రైతులు

అన్నదాత అతలాకుతలం

నిండా ముంచిన మొంథా తుపాను ●1591 ఎకరాల్లో వరి, 161 ఎకరాల్లో పత్తికి నష్టం



సువర్ణముఖి నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి



పాలకొండ.. నీట మునిగిన వరిచేనును చూపిస్తున్న సిఐటియు నాయకులు రమణారావు



వీరఘట్టం.. కొట్టుగుమ్మడ గ్రామంలో నేలకొరిగిన వరిచేను, పొలంలో చేరిన నీరు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో మొంథా తుపాను అన్నదాతలను అతలాకుతలం చేసింది. వరి, పత్తి పంటలు చేతికందే సమయంలో కోలుకోలేని దెబ్బ తీసింది. గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు, ఈదురుగాలులకు వరి చేలు నేలకొరిగాయి. మరో వారం లేదా పది రోజుల్లో వరి కోతలు మొదలు కానున్నాయి. పత్తి పంట కూడా దిగుబడికి సిద్ధంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో తుపాను కారణంగా తలెత్తిన నష్టాన్ని చూసి అన్నదాత గుండె చెరువు అవుతోంది. వేలాది రూపాయల మదుపు పెట్టి పండించిన పంట చేతికొచ్చే సమయంలో నీటిలో మునిగి పోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో పది మండలాల్లో 1591 ఎకరాల్లో వరి, 161 ఎకరాల్లో పత్తి పంటలకు నష్టం జరిగిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పూర్తి స్థాయిలో సర్వే జరిగితే నష్టం పెరిగే అవకాశం ఉంది.

2500 ఎకరాల్లో నీటమునిగిన వరి

పాలకొండ : తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలో గోపాలపురం, అంపిలి, పిఆర్‌పేట, బాసూరు, వెలగవాడ, సింగనవలస, తదితర గ్రామాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 2500 ఎకరాల వరకు వరి పంట నీట మునిగింది. పట్టణంలో నష్టపోయిన వరిపంటను సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పరిశీలించారు. నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలని ఆయన కోరారు. కాకి లెక్కలు వేయకుండా ప్రతి రైతుకూ న్యాయం చేసేలా నష్టాన్ని అంచనా వేయాలన్నారు.

- గోపాలపురం, అన్నవరం, పంపటపల్లి గ్రామాల్లో ముంపునకు గురైన పొలాలను తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి, ఎంపిడిఒ విజయ రంగారావు పరిశీలించారు. వీరితోపాటు గోపాలపురం సర్పంచ్ జగదీష్, విఆర్‌ఒ రాజా ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మొంథా తుపాను ఎఫెక్ట్ ఏజెన్సీపై పడింది. దీంతో గుమ్మలక్ష్మీపురం మండలంలోని పలుచోట్ల పంటలకు నష్టం వాటిల్లింది. దుడ్డుఖల్లు, కొత్తవలస గ్రామాల్లో వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు కొంతమేర నష్టం వాటిల్లింది. మండల ప్రత్యేక అధికారి కనకదుర్గ, ఎంపిడిఒ శ్రీనివాసరావు, తహశీల్దార్ ఎన్.శేఖర్ గ్రామాల్లో పర్యటించారు. జియ్యమ్మవలస మండలంలో పెదబుడ్డిడి, చినబుడ్డిడి, పరజపాడు, ఇటిక తదితర గ్రామాల్లో వరిచేలు నేలకొరిగాయి. పెదబుడ్డిడి గ్రామ సమీపంలో వరి చేలు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి.

పత్తి రైతు చిత్తు

భామిని : జిల్లాలో మూడు రోజులపాటు కురిసిన వర్షాలతో భామిని మండలంలో పత్తి రైతులకు తీవ్ర నష్టం ఏర్పడింది. పత్తి చెట్టు కాయలు వర్షాలతో పొలంలోనే తడిసి రంగు మారి, మొలకలు వచ్చాయి. పలుచోట్ల పత్తి పొలాలు నీటితో నిండిపోయాయి. ఉన్న పత్తి మొక్కలు కూడా వేరు కుళ్లు తెగులు సోకి నల్లగా మారి, ఆకులు మాడిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బ్యాంకుల్లో అప్పులు తెచ్చి పత్తి పంటకు పెట్టుబడి పెట్టామని, నేడు ఆ పత్తి పొలంలోనే తడిసి మొక్కలు మొలిచాయని వాపోయారు. పంట నష్టపోయిన రైతులకు, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

నేలకొరిగిన వరి పంట

వీరఘట్టం : మండలంలోని వీరఘట్టం, కొట్టుగుమ్మడ, పనసనందివాడ, తలవరం గ్రామాల్లో వరిచేను నేలకొరిగింది. ఆయా పంటలను ఎఒ సౌజన్య ఆధ్వర్యాన కెవికె శాస్త్రవేత్తలు పరిశీలించారు. రైతులకు పలు సూచనలు అందజేశారు.

ఆందోళన వద్దు

రైతులందరికీ న్యాయం చేస్తాం : మంత్రి

ప్రజాశక్తి-సాలూరు

పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందొద్దని, అందరికీ న్యాయం చేస్తామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీనిచ్చారు. సాలూరు పట్టణ, మండల అధికారులతో బుధవారం మంత్రి అత్యవసర సమీక్ష నిర్వహించారు. తుపాను పరిస్థితులను ఎదుర్కోవడంలో ప్రజల భద్రత, ఆహారం, వైద్య సేవలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నదీ తీర ప్రాంతాలలో నివసించే ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. నిరాశ్రయులైన పేదలకు ఎప్పుడు బియ్యం అవసరమైనా వెంటనే అందించాలని చెప్పారు. అవసరమైతే తానే సొంత నిధులను ఇస్తానని, పేదల ఆకలి తీర్చడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వైటిసి భవనంలో ఆశ్రయం పొందుతున్న గర్భిణులకు సరైన సమయంలో వైద్యం, పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలన్నారు. తుపాను కష్టం తీరే వరకు అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ నీలకంఠరావు, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, రూరల్ సిఐ పి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి సందర్శన

వరదనీటిలో చిక్కుకున్న మామిడిపల్లి పిహెచ్‌సిని మంత్రి సంధ్యారాణి పరిశీలించారు. వైద్యులు, అధికారులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. సువర్ణముఖి నీటి ప్రవాహాన్ని మంత్రి పరిశీలించారు.

- మొంథా తుఫాను నేపథ్యంలో పైన పడుతున్న వర్షాలకు సాలూరు ప్రాంతంలో వేగావతి, సువర్ణముఖి నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రజల రాకపోకలకు కొంతవరకు అంతరాయం కలిగింది



వంతెన పైనుంచి ప్రవహిస్తున్న నీరు



వంతరాం గ్రామంలోకి చేరిన వరదనీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

వంతరాంలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలో వంతరాం గ్రామం వరదనీటి తాకిడికి గురవడంతో బుధవారం ఆ గ్రామాన్ని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ వైశాలి సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. తుపాను సమయంలో ప్రతిసారీ గ్రామంలోకి నీరు చేరుతోందని గ్రామస్తులు వివరించారు. బ్రిడ్జి సమీపంలో కాజ్‌వే లేదా రిటర్నింగ్ వాల్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పోలీస్ వాహనంలో ముంపు ప్రాంతాలను, కెజిబివిని కలెక్టర్ సందర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పెంకు వేణుగోపాల్ నాయుడు, ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మి, సూపర్వైజర్ పద్మావతి, ఎస్‌ఐ సింహాచలం పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో లాడ గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఆరిక రమేష్ రేకిల్లు ముందు భాగం కూలిపోయింది. ఎపిఒ వెంకట గణేష్, తహశీల్దార్ డి.శ్రీకన్య, ఎంపిడిఒ బిబి మిశ్రా, ఆర్‌ఐ విజయ గణేష్ బాబు, హౌసింగ్ ఎఇ వెంకటేష్ ఆ ఇంటిని పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు. ఓంద్రు జ్వాల గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ కొంతమేర నేలకొరిగింది.

సాలూరు : కొదమ పంచాయతీ పొయిమాల గ్రామంలో చౌడిపల్లి గురునాథం ఇల్లు కూలిపోయింది.

కొమరాడ : కెమిశీల పంచాయతీ తులసివలస గ్రామంలో నల్లా మోహనరావు రేకు ఇల్లు మట్టి గోడ వర్షానికి నాని కూలిపోయింది.



కురుపాం.. గొర్జపాడులో ఇళ్లు కూలిపోవడంతో పునరావాసం పొందుతున్న కుటుంబాలు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎస్‌టి గొయ్యిపాకలో బుధవారం ఉదయం కిల్లక బాబాయిలు ఇంటి గోడ వర్షానికి కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

పునరావాసంలో 3 గిరిజన కుటుంబాలు


కురుపాం : మండలంలోని మొండెంఖల్లు పంచాయతీలో గొర్జపాడు గ్రామంలో తుపాను నేపథ్యంలో కురిసిన వర్షాలకు చింతపల్లి రాజేశ్వరి, కద్రక నాగమ్మ, శివ్వల తేజావతి ఇళ్ల గోడలు వాలిపోయాయి. దీంతో స్థానిక ఎంపిపి పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి విఆర్‌ఒ పి.బోడమ్మ ఆ కుటుంబాలను తరలించారు. భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో వెలుగు సిసి, నీలకంఠాపురం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం.. ఎస్‌టిగొయ్యిపాకలో కూలిన ఇంటిగోడ

ఉపాధ్యాయులపై వేధింపులు!

- లేటు ముఖహాజరు నమోదైందంటూ టీచర్లకు నోటీసులు
- 24 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని డిఇఒ హుకుం
- ఎక్కడాలేని సంప్రదాయం మన్యం జిల్లాలో
- సాంకేతిక కారణాల వల్లేనన్న గురువులు
- భగ్గుమంటున్న ఉపాధ్యాయ సంఘాలు



ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జిల్లా విద్యా శాఖ నోటీసులు జారీ చేసింది. పాఠశాలలకు హాజరైన ఉపాధ్యాయులు సకాలంలో ముఖ హాజరు (ఎఫ్‌ఆర్‌ఎస్) వేయాల్సి ఉంటుంది. ఉదయం 9.30 గంటల్లోగా ముఖ హాజరు నమోదు చేయాల్సి ఉంది. అయితే ఇంటర్నెట్ సిగ్నల్స్ సరిగ్గా లేకపోవడం వల్లనో, సర్వర్ బిజీగా ఉండడం వల్లనో కొంతమంది ఉపాధ్యాయుల హాజరు ఉదయం 9.30 తర్వాత నమోదైంది. ఇలాంటి ఉపాధ్యాయులను గుర్తించిన జిల్లా విద్యాశాఖాధికారి వారందరికీ నోటీసులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఉపాధ్యాయులు సుమారు 700 మందికి అధికారులు నోటీసులు అందజేశారు. ముఖ హాజరు వెంటనే నమోదు కావాలంటే ఆ పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఇంటర్నెట్ సిగ్నల్స్ సరిగ్గా ఉండాలి. సాంకేతిక కారణాల రీత్యా ఈ ఉపాధ్యాయుల ముఖ హాజరు ఆలస్యంగా నమోదైంది. ఉపాధ్యాయులు ఉద్దేశపూర్వకంగా ముఖ హాజరు నమోదు చేస్తే దాన్ని తప్పుగా అధికారులు భావించాల్సి ఉంటుంది. అంతే కానీ సాంకేతిక కారణాల వల్ల ముఖ హాజరు నమోదు ఆలస్యమైతే ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేయడం వివాదాస్పదమవుతోంది. డిఇఒ.. మండల విద్యాశాఖాధికారి, హెచ్‌ఎంల ద్వారా ఉపాధ్యాయులకు నోటీసులు అందజేశారు.

మారుమూల ప్రాంతాల్లో సరైన ఇంటర్నెట్ సిగ్నల్స్ లేకపోవడంతో ఉపాధ్యాయుల ముఖ హాజరు నమోదులో జాప్యం జరుగుతున్నదనే వాస్తవాన్ని అధికారులు గుర్తించకుండా నోటీసులిచ్చి సంజాయిషీ కోరడంపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ జిల్లాలో ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేయడాన్ని తప్పుపడుతున్నాయి. మొంథా తుపాను కారణంగా రాష్ట్ర ప్రభుత్వం గత మూడు రోజులుగా పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. ఉపాధ్యాయులు సెలవుల్లో ఉన్న సమయంలో ఆదరాబాదరాగా నోటీసులు జారీ చేయడం వెనుక ఆంతర్యమేమిటనే చర్చ జరుగుతోంది. గత కొంతకాలంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో షాడో అధికారి పాలన నడుస్తోంది. జిల్లా ఏర్పడిన నాటినుంచి ఆయన హవా సాగుతోంది. గడచిన మూడున్నర ఏళ్లలో పని చేసిన ఇన్‌ఛార్జి డిఇఒలలో ఇప్పుడున్న అధికారి షాడో అధికారి చేతిలో కీలుబొమ్మలా మారారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశమవుతోంది. సెలవుల్లో ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తోంది.

సాంకేతిక సమస్యలు పరిష్కరించండి

ఉపాధ్యాయుల ముఖ ఆధారిత హాజరు ఆలస్యంగా నమోదు చేస్తున్నారని దానిపై సంజాయిషీ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి నోటీసులు జారీ చేయడం సరికాదు. తుపాను కారణంగా పాఠశాలకు సెలవులు ఇచ్చే సమయంలో సంజాయిషీ ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేయడం అన్యాయం. అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల ముఖ ఆధారిత హాజరు నమోదుకు సాంకేతిక సమస్యలు రాకుండా తగిన ఏర్పాట్లు చేయాలి. తక్షణమే ఆ ఉత్తర్వులను విరమించుకోవాలి.

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు,
జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు

తడిసిన పంటను ప్రభుత్వమే కొనాలి

తుపానుతో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సిపిఎం నాయకులు



కొమరాడలో వర్షానికి తడిచిపోయిన పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కొమరాడ

తుపానుతో తడిసిన మొక్కజొన్న, పత్తి, ధాన్యం కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొమరాడలో తుపానుతో నష్టపోయిన పంటలను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపానుతో పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కురుపాం నియోజకవర్గంలో వెంటనే వరి, మొక్కజొన్న, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం సందర్శన

సాలూరు : పట్టణంలో వైటిసిలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని బుధవారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు సందర్శించారు. ఆ శిబిరంలో ఉన్న సమత కాలనీ వాసులతో మాట్లాడి, అందుతున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలో సమతా కాలనీ, దండిగాం రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, వేగావతి కాలనీ, బంగారమ్మ కాలనీలో అనేకమంది నేటికీ పూరి గుడిసెలలోనే జీవిస్తున్నారని తెలిపారు. శాశ్వత నివాసాలు కట్టుకునే ఆర్థిక స్థోమతలు లేకపోవడమే అందుకు కారణమని తెలిపారు. వారు నివాసాలు ఉన్నచోటే ఇల్లు కట్టుకునేలా ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

- మామిడిపల్లి పిహెచ్‌సిని, ముంపునకు గురైన పంట పొలాలను సిపిఎం నాయకులు పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



సాలూరు పట్టణంలో పునరావాస కేంద్రంలో ఉన్న వారితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు



గంగరేగువలస ఒడ్డుపైకి చేరిన జంఝావతి నది

'జంఝావతి'లో పెరిగిన నీటి ప్రవాహం

ప్రజాశక్తి-కొమరాడ

తుపాను నేపథ్యంలో ఒడిశా ప్రాంతంలో వర్షాలు భారీగా కురవడంతో జంఝావతి నదిలో బుధవారం ఉదయం నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. ఇప్పటికే అప్రమత్తమైన రబ్బర్‌డ్యామ్ అధికారులు నీటిని కిందికి విడిచిపెడుతున్నారు. నది పరివాహక ప్రాంతాలైన కోటిపాం, గంగరేగువలస, గుంపగదవలస గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. స్నానానికి నది వద్దకు వెళ్లకూడదని చెప్పారు.



సంచరిస్తున్న అడవి ఏనుగుల గుంపు

వీడని ఏనుగుల బెంగ

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

అడవి ఏనుగుల గుంపు కురుపాం నియోజకవర్గాన్ని వీడటం లేదు. జియ్యమ్మవలస మండలంలోని గవరంపేట, బాసంగి పరిసర ప్రాంతాల్లో ఉన్న అరటి తోటల్లో బుధవారం ఉదయం సంచరించిన ఏనుగుల గుంపు.. సాయంత్రం వెంకటరాజపురం తోటల్లో చేరాయి. పరిసర ప్రాంతాల ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. ఏనుగులు కనిపించే సమయంలో ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని కోరారు. ఏనుగుల సంచారంతో తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



క్యాబేజీ పంటను పరిశీలిస్తున్న కూటమి నాయకులు

పంటను పరిశీలించిన కూటమి నాయకులు

ప్రజాశక్తి-వీరఘట్టం

తుపాను తీవ్రత వల్ల నష్టపోయిన క్యాబేజీ పంటను కూటమి నాయకులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, జంప్ చంద్రశేఖర్, సరిపల్లి అచ్యుతరావు, కె.సాయి పవన్, ఉద్యాన శాఖ అధికారులు జయశ్రీ పరిశీలించారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని వారు భరోసా ఇచ్చారు.

సబ్‌జైలు సందర్శన

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సబ్ జైలు చుట్టూ పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి, ఆరోగ్యం, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉచితంగా న్యాయ సహాయం కావాలంటే ఏర్పాటు చేస్తామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. క్యారమ్ బోర్డు, చెస్, మానసిక పరివర్తన కలిగించే పుస్తకాలు ఖైదీలకు అందజేశారు.

సహాయక చర్యల్లో ముందుండాలి : జనసేన

ప్రజాశక్తి-సీతంపేట

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు మొంథా తుపాను సహాయక చర్యల్లో జన సైనికులు ముందుండాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు మండంగి విశ్వనాథం కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ యంత్రాంగానికి పార్టీ శ్రేణులు సహకరించాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ప్రజలకు అండగా ఉండాలని కోరారు.

అడవి పునరుద్ధరణపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని మర్రిపాడు పంచాయతీ పరిధిలో ఎగువద్వారబంధం గ్రామంలో వాతావరణ మార్పుకు కారణాలు - ప్రభావాల్లో భాగంగా అడవి పునరుద్ధరణ కార్యక్రమంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ పాలక, నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రైతు వాతావరణ అనుకూలమైన మిశ్రమ తోటలు వేసి అడవిని పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సవర ఆనందరావు, సిసి బిడ్డిక రామయ్య పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలో నీటి సరఫరాకు గురువరాం అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ టి.టి.రత్నకుమార్ తెలిపారు. పెద్దగెడ్డ నుంచి వేగావతి నదికి నీరు విడుదల చేయడం వల్ల ప్రవాహం ఉధృతంగా ఉందని తెలిపారు. బురద నీరు కూడా వస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం పట్టణ ప్రజలకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

సురక్షిత ప్రాంతాల్లో పశువులను కట్టాలి

ప్రజాశక్తి-కురుపాం

తుపాను నేపథ్యంలో పశువులను బయట ప్రాంతాలకు విడిచిపెట్టకుండా సురక్షితమైన ప్రాంతాల్లోనూ కట్టాలని పశు సంవర్ధక శాఖ ఎడి సంధ్య సూచించారు. బుధవారం మండలంలో ఆవిరి, టొంపలపాడు, వలసబల్లేరు గ్రామాలను వెటర్నరీ వైద్యాధికారి కె.శైలజతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాడి రైతులతో మాట్లాడారు. తుపాను తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పశువులు ఏమైనా అనారోగ్యం బారిన పడినా, మరణించినా వెంటనే సచివాలయ పరిధిలో పశువైద్య సహాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్లు అఖిలేష్, నూకరాత్నం, పశువైద్య సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.



పాడి రైతులతో మాట్లాడుతున్న వెటర్నరీ ఎడి సంధ్య

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

పోస్ట్ డిజాస్టర్‌పై ప్రత్యేక దృష్టిసారించాలి • అధికారులకు కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పోస్ట్ డిజాస్టర్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అధికారులను హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యల పట్ల ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారన్నారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలసి మొంథా తుపానుపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. స్థానిక నాయకులు, యువత నుంచి మంచి సహకారం అందిందని, ఇది అభినందించ దగ్గ విషయమని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం మూడు విపత్తులను దాటామని, ప్రస్తుతం పోస్ట్ డిజాస్టర్‌ను ఎదుర్కోవడం ప్రధాన కర్తవ్యమని అన్నారు. నీటి నిల్వలను తొలగించి శుభ్రం చేయాలని, నిర్లక్ష్యం వహించకుండా ముందుకు సాగాలని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తాగునీరు శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మట్టిగోడలు పాడైన, కూలిన వాటిని గుర్తించాలని, పశువులు, వ్యవసాయ నష్టాలను సంబంధిత అధికారులు జాప్యం లేకుండా అంచనాలను వేయాలని సూచించారు. సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మండల వ్యవసాయ అధికారులు త్వరితగతిన అంచనాలను చేపట్టాలన్నారు.

పాఠశాలలు ప్రారంభించవచ్చని, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలు వినియోగించకుండా సత్వర చర్యలు చేపట్టాలని చెప్పారు. రానున్న రోజుల్లో రిజర్వాయర్లు లైవ్ డేటా వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పిహెచ్‌సి, సిహెచ్‌సిలకు తరలించిన గర్భిణులు మరికొన్ని రోజులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. చెరువులు నిండగా ఉన్నాయని, గండ్లు పడే అవకాశం ఉన్నందున ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు షాపులపై దాడులు నిర్వహించాలని ఆదేశించారు. విధులకు హాజరు కాని వారి పేర్లు శాఖల వారీగా జాబితా అందజేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం 115 జిఒను విడుదల చేసిందని, రిలీఫ్ కేంద్రాల్లో ఉన్న వారికి కిట్లు అందజేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు, సిపిఒ ఎస్.ఎస్.ఆర్.పట్నాయక్, ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, కలెక్టరేట్ ఎఒ కె.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.




అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

ఉధృతంగా గెడ్డ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గుమ్మడిగూడ పంచాయతీ గుజ్జలగండ గ్రామానికి వెళ్లే మార్గంలోని గెడ్డ తుపాను నేపథ్యంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గిరిజనుల రాకపోకలు నిలిచిపోయాయి. గుజ్జలగండకు వెళ్లేందుకు రెండు కాజ్‌వేలు నిర్మించగా గతంలో భారీ తుపాను సమయంలో ఒకటి కొట్టుకుపోయింది. మరో కాజ్‌వేపై నుంచి ఇప్పుడు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పూర్తిగా రాకపోకలు స్తంభించాయి. ఎమ్మెల్యే జగదీశ్వరి ఆదేశాలతో ఎంపిడిఒ ఉమామహేశ్వరి వెళ్లి కాజ్‌వేను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సమాచారాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే గిరిజన సంక్షేమ శాఖ ఇఇతో ఎమ్మెల్యే మాట్లాడి, శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మండల కన్వీనర్ కెవి కొండయ్య, ఎస్‌ఐ పి.నారాయణరావు, ఇఒపిఆర్‌డి జి.రమేష్‌బాబు పాల్గొన్నారు.



గుజ్జలగండకు వెళ్లే రహదారిలో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ

కాజ్‌వే పైనుంచి నీటిప్రవాహం

పరిశీలించిన ఎమ్మెల్యే



ఒట్టిగెడ్డ కాజ్‌వేపైనుంచి వెళ్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలంలోని రావాడ వద్దనున్న ఒట్టిగెడ్డ కాజ్‌వే వద్ద నీటి ప్రవాహాన్ని బుధవారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరిశీలించారు. ఒట్టిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం పెరగడంతో కిందికి విడుదల చేస్తున్నారని, తూర్పుముఠా ప్రాంతానికి వెళ్లే వాహనాలు నిలుపుదల చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కాజ్‌వేపై నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో రాకపోకలు సాగిస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండలాల కన్వీనర్లు జోగి భుజంగరావు, అడ్డాకుల నరేష్, పిఎసిఎస్ చైర్మన్ సోముల మాస్టర్, దాసరి రామారావు, బిజెపి ఎస్‌టి మోర్చా జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం, మాజీ ఎంపిటిసి సభ్యులు మండంగి ప్రసాద్ రావు, రామారావు, బాలు పాల్గొన్నారు.

సిహెచ్‌సిలో చేరిన వర్షపు నీరు

భారీ వర్షాలకు భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం లోపల, బయట చుట్టూ వర్షపు నీరు చేరింది. రోగులు, వైద్య సిబ్బంది రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఎల్విన్‌పేట సచివాలయానికి వెళ్లే మార్గంలో సిమెంటు రహదారిపై నీరు చేరడంతో ఉద్యోగులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తుపాను కారణంగా గుమ్మలక్ష్మీపురంలో బుధవారం జరిగే గిరిజన వారపు సంత బోసిపోయింది. వర్షాలు కారణంగా జన సంచారం లేకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. జియ్యమ్మవలస మండలంలో గెడసింగుపురం రహదారిపై నుంచి ఉమ్మగెడ్డ ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జియ్యమ్మవలస, వీరఘట్టం ప్రాంతాలకు రాకపోకలు సాగించాలంటే ఉమ్మగెడ్డ మీదుగా ప్రయాణించాల్సిందే. ఈ గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలను టిడిపి మండల అధ్యక్షులు జోగి భుజింగరావు అప్రమత్తం చేశారు.

ఎండిఎం ప్రయివేటీకరణను విరమించుకోవాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-పార్వతీపురం

పాఠశాలల్లో గత 20 సంవత్సరాలుగా విజయవంతంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటీకరించే ప్రయత్నం చేస్తోందని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.తులసి ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దీనిలో భాగంగానే పట్టణాల్లోని అన్ని ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వంట విధానాన్ని రద్దుచేసి ఒకే చోట స్మార్ట్ కిచెన్ పేరుతో నిర్వహించాలని యోచిస్తున్నట్లు తెలిసిందని చెప్పారు. పార్వతీపురం మండల పరిధిలోని నర్సిపురం వద్ద సామూహిక వంటశాల నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రయత్నాలను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 5 వేల మంది విద్యార్థులకు ఒకే చోట వంటవండి వాహనాల ద్వారా పంపిణీ చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. గత 20 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు సేవా దృక్పథంతో ఈ పథకం నిర్వహిస్తున్నారని, లక్షల రూపాయలు ముందస్తు పెట్టుబడులు పెట్టి నిర్వహిస్తుంటే.. వారికి నష్టం చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించడం సమంజసం కాదన్నారు. వీరందరికీ కనీస వేతనాలు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా ఈ రకంగా ఉన్న ఉపాధిని కూడా తీసేయడం అత్యంత నీచమైన చర్యని దుయ్యబట్టారు. మహిళలను ఉద్ధరిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఇలా మహిళలకు ద్రోహం చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించి వారి వద్ద నుండి లక్షల్లో కమీషన్లు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ప్రయత్నం ఇదని విమర్శించారు.. ఈ ప్రైవేటీకరణ విధానాన్ని మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం, సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న నిర్వాహకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం నాయకులు ధనలక్ష్మి, లక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కుటుంబాలకు

రూ.50 లక్షల చొప్పున పరిహారమివ్వాలి

ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ • కొనసాగుతున్న జీపుయాత్ర

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన ఆశ్రమ పాఠశాలలో మృతి చెందిన 16 మంది విద్యార్థులు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జీపుయాత్ర ఏడో రోజు బుధవారం కొనసాగింది. జియ్యమ్మవలస మండలం ఏనుగులగూడ నుంచి కురుపాం మండలంలోకి ప్రవేశించింది. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సందర్శించి, అక్కడ మౌలిక వసతులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలవుతుందా? లేదా? అని ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేకి రోజుకు రూ.2,500 కేటాయిస్తున్న ప్రభుత్వం.. గిరిజన విద్యార్థులు మెస్‌ఛార్జీలకు మాత్రం 50 రూపాయలు ఇవ్వడం సమంజసం కాదన్నారు. హాస్టల్ విద్యార్థులకు సరైన ఆహారం అందక ఎక్కువమంది రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖాధికారులు ప్రతినెలా వసతిగృహాలను సందర్శించాలని డిమాండ్‌చేశారు. లేకుంటే అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒను కోరారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆశ్రమ పాఠశాలలో ఎఎన్‌ఎంలను నియమిస్తామని మొదటి సంతకం చేసి 15 నెలలైనా అమలు కాలేదని ఆక్షేపించారు. ఇప్పటికైనా ఎఎన్‌ఎంలను నియమించాలని డిమాండ్‌చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి టి.అఖిల్, బి.అనిల్ మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో విద్యార్థులకు వేడి భోజనం, తాగడానికి వేడినీరు అందించాలన్నారు. నిరంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతోనే ఉండాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జీపుయాత్రకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.సీతారాం సంఘీభావం తెలిపారు.



కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు గంగారావు


జిల్లాల పునర్విభజనలో

పాలకొండకు న్యాయం చేయాలి

మంత్రిని కోరిన పాలకొండ జిల్లా సాధన సమితి

ప్రజాశక్తి-పాలకొండ

జిల్లాల పునర్విభజనలో పాలకొండకు న్యాయం చేయాలని పాలకొండ జిల్లా సాధన సమితి బృందం మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరింది. సాలూరులో ఆమె క్యాంప్ కార్యాలయంలో మంత్రిని సమితి సభ్యులు బుధవారం కలిశారు. పాలకొండ పాత రెవెన్యూ డివిజన్ ఒక జిల్లాగా చేయాలని, లేకుంటే శ్రీకాకుళం జిల్లాలో కలపాలని కోరారు. గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా జిల్లాల విభజన చేసి, పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను మూడు ముక్కలు చేసిందని తెలిపారు. దీనిపై 2020 నుంచి రాజకీయాలకు అతీతంగా జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తున్న నేపథ్యంలో పాలకొండ ప్రాంత ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సాధన సమితి గౌరవాధ్యక్షులు కనపాక చౌదరి నాయుడు, అధ్యక్షులు బుడితి అప్పలనాయుడు, కోశాధికారి సబ్బ నానాజీ, రుంకు రామకృష్ణ, విశ్రాంత సైనికుల ఉద్యోగాల సంఘం పాలకొండ ఉపాధ్యక్షులు వెన్నపు వెంకటరమణ, నాయకులు నెల్లి సత్యంనాయుడు, యందవ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావును కూడా ఇదే విషయమై సమితి సభ్యులు కలిశారు.



మంత్రికి వినతి అందిస్తున్న పాలకొండ జిల్లా సాధన సమితి సభ్యులు

మధుబాలకు ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

ఆలిండియా పోలీసు మీట్‌లో కాంస్య పతకం సాధించిన ఎఆర్ కానిస్టేబుల్ మధుబాలను ఎస్‌పి మాధవరెడ్డి అభినందించారు. మరెన్నో విజయాలు సాధించి పోలీస్ శాఖ ఖ్యాతి పెంచాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఎఆర్ ఆర్‌ఐలు నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.



మధుబాలను అభినందిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

పంట నష్టం అంచనా వేయాలి



బలిజిపేట.. నేలకొరిగిన వరిచేనును పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కురుపాం

తుపాను నేపథ్యంలో మండలంలో నేలకొరిగిన పంటలను సమగ్ర సర్వే చేపట్టి, నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ఎంపిపి శెట్టి పద్మావతి అధికారులను కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలు, ఈదురుగాలులకు మండలంలో ఎక్కడికక్కడ అరటి, మొక్కజొన్న, వరి తదితర పంటలు నేలకొరిగి రైతులు కన్నీరు మున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు తాత్సారం చేయకుండా, వెంటనే నష్టాన్ని అంచనా వేయాలని చెప్పారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి

బలిజిపేట : పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని వైసిపి మండల అధ్యక్షులు పి.మురళీకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు ఎ.రవికుమార్ కోరారు. బుధవారం మండలంలోని వంతరాం, నారాయణపురం, నూకలవాడ, చిలకలపల్లి, బలిజిపేట, పలగర గ్రామాల్లో వర్షాలతో దెబ్బతిన్న పంటలను వారు పరిశీలించారు.

పంట నష్టాన్ని పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-గరుగుబిల్లి

మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, రావుపల్లి గ్రామాల్లో కెవికె శాస్త్రవేత్తలు ధ్రువ, ఎస్.స్రవంతి, అమృతవీణ, అనంత విహారితో కలిసి ఎఒ టి.జ్యోత్స్న బుధవారం పర్యటించారు. పంట నష్టాన్ని పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు.

సీతానగరం : మండలంలోని వెంకటాపురం, ఆర్.వెంకంపేట గ్రామాల్లో ఎఒ ఎస్.అవినాష్‌తో కలిసి కెవికె శాస్త్రవేత్తలు పర్యటించారు. వరి రైతులకు యాజమాన్య పద్ధతులపై సూచనలు చేశారు.



సీతానగరం.. రైతులతో మాట్లాడుతున్న కెవికె శాస్త్రవేత్తలు

పెద్దూరు గిరిజన పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని పెద్దూరు గిరిజన గ్రామ పాఠశాలను బుధవారం సచివాలయ సిబ్బంది పరిశీలించారు. పాఠశాలలో చేరిన వర్షం నీటిపైఐ బుధవారం 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సిబ్బంది మాట్లాడారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకున్నందున ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, గ్రామంలో ఉన్న చర్చిలో తాత్కాలికంగా పిల్లలకు చదువు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి దిలీప్ కుమార్, విఆర్‌ఒ జి.రాజేంద్రప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎన్.రాహుల్ కుమార్ పాల్గొన్నారు.